క్లుప్తంగా

నేడు చిత్తారపురంలో 'గడప గడపకు..'

సంతకవిటి: మండలంలోని చిత్తారపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సిరిపురపు జగన్ మోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కంబాల జోగులు హాజరవుతారని పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

రేగిడి: చెరకు సాగు చేసే రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి జి. మురళీకృష్ణ అన్నారు. మండలంలోని వెంకటాపురంలో యాజమాన్య పద్ధతులతో సాగు చేస్తున్న కింజరాపు సురేష్‌కుమార్ పంట పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ, చెరకు విత్తే సమయంలో ప్రధానంగా ఒక వరుసకు మరో వరుసకు మధ్య రెండు అడుగులు మాత్రమే రైతులు ఖాళీ ఉంచుతారని, అలా కాకుండా ఐదు అడుగుల సాళ్లు తేడా ఉంటే పంట ఏపుగా పెరుగుతుందన్నారు. ఈ విధానం వల్ల చీడపీడల బెడద ఉండదని చెప్పారు. గాలి, వెలుతురు బాగా తగిలి దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు.

పరామర్శ



అప్పలనాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: మండలంలోని కంచరాం గ్రామానికి చెందిన గ్రామ సచివాలయ కన్వీనర్ గెడ్డాపు అప్పలనాయుడును రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై శ్రీకాకుళం, విశాఖపట్నం ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన అప్పలనాయుడును ఎమ్మెల్యే కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో కంచరాం సర్పంచ్ గెడ్డాపు సుబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, జేసీఎస్ మండల కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో ఆరోగ్యం



గుళ్లసీతారాంపురంలో చేతులు శుభ్రం చేసుకుంటున్న గ్రామస్తులు

సంతకవిటి: అరచేతిలోనే ఆరోగ్యం ఇమిడి ఉంటుందని వెలుగు సీసీ అరుణ అన్నారు. మండలంలోని గరికిపాడు, గుళ్లసీతారాంపురం గ్రామాలలో ఆదివారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,మనం ఆరోగ్యంగా ఉండాలంటే ముందు మన చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల 80శాతం రోగాలు రావని తెలిపారు.

నకిలీ పురుగు మందులు విక్రయిస్తే చర్యలు



బూరాడలో ఫెర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ

రేగిడి: నకిలీ పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ హెచ్చరించారు. మండలంలోని బూరాడ, పనసలవలస గ్రామాల్లోని ఫెర్టిలైజర్స్ షాపులను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. రైతులను మోసగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బాగెంపేటలో పారిశుధ్య పనులు



కాలువలను శుభ్రం చేస్తున్న కార్మికులు

వంగర: మండల పరిధి బాగెంపేటలో ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ రెడ్డి సత్యవతి ఆధ్వర్యంలో కార్మికులు కాలువల్లోని చెత్తాచెదారాలు తొలగించారు. అనంతరం కాలువల్లో దోమల నివారణకు బ్లీచింగ్ పిచికారీ చేశారు.

అమ్మా భవానీ...

దుర్గాదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు ఆదివారంతో ప్రారంభమయ్యాయి. వాడవాడలా అమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు, యువత మాలధారణ చేసి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించి, మంటపాల్లో ప్రతిష్ఠించారు. జై దుర్గ.. జై జై దుర్గ అంటూ భక్తులు నినదించగా.. ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనుంది. ఇందుకు తగిన ఏర్పాట్లను కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల పెద్దలు పూర్తి చేశారు. ఈ నెల 24తో ఉత్సవాలు ముగియనున్నాయి.

– బొబ్బిలి/ రాజాం నెట్‌వర్క్



బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లి దాడితల్లి కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం



తెర్లాం: పెరుమాళిలో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు



బొబ్బిలి: పక్కి గ్రామంలో ఆధ్యాత్మిక సందేశం వినిపిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బాడంగి: ఉమాసోమేశ్వరాలయంలో లక్ష్మీదేవిగా పూజలందుకుంటున్న ఉమాదేవి



వంగర: వంగర బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు



రాజాం : బొద్దాంలో దుర్గాదేవికి భక్తుల పూజలు



రామభద్రపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం దగ్గర దుర్గాదేవి విగ్రహానికి పూజలు చేస్తున్న శ్రీరామ్‌నగర్ కాలనీ యువత



సంతకవిటి: సంతకవిటిలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి



రాజాం సిటీ: నవదుర్గ మాతకు పూజ చేస్తున్న అర్చకుడు



రేగిడి : సంకిలిలో పూజలు చేస్తున్న భక్తులు

చిరస్మరణీయుడు అబ్దుల్ కలాం

రాజాం సిటీ: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిరస్మరణీయుడని స్నేహం అసోసియేషన్ కన్వీనర్ అంబికా కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం కలాం జయంతిని పురస్కరించుకుని కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలాం జాతి గర్వించదగ్గ నేత అని, భారతదేశ ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన మహనీయుడని కొనియాడారు. కలాంను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో స్నేహ అసోసియేషన్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్య, యూఎస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



రాజాం సిటీ: కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్నేహ అసోసియేషన్ సభ్యులు

పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సి.హెచ్.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. అనంతరం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పుస్తక పఠనం చిన్నతనం నుంచి అలవాటు చేసుకుంటే ఎన్నో మంచి విషయాలు తెలుస్తాయన్నారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు అపారమైన జ్ఞానం కలుగుతుందన్నారు. పుస్తక పఠనంతో పాటు కథలు చెప్పడం, రాయడం నేర్చుకోవాలని, చిత్రలేఖనంపై కూడా దృష్టి సారించాలన్నారు.

విచారణ ప్రారంభించడం అభినందనీయం

బొబ్బిలి: స్థానిక ఇందిరమ్మకాలనీలో నకిలీ ఇళ్లపట్టాల పేరిట జరుగుతున్న అక్రమాలపై విచారణ ప్రారంభించడం అభినందనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.శంకరరావు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన కాలనీలో పట్టాలు అమ్ముకుని, కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ కొనసాగించాలని అధికారులను కోరారు. ఆయన వెంట ఆ పార్టీ మండల కార్యదర్శి ఎస్. గోపాలం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శంకరరావు

ట్రై మోటారుసైకిల్ అందజేత

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని చిన్నబజారు వీధిలో పట్నాల వెంకటరావు తదితర దివ్యాంగులకు ఆదివారం ట్రై మోటారు సైకిళ్లు అందజేశారు. సీఎస్ఆర్ పథకం కింద ఇటీవల కలెక్టరేట్‌లో అందజేసిన ఈ వాహనాలను వలంటీర్లు లబ్ధిదారులకు అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,338 మంది దివ్యాంగులకు కేటాయించిన ఉపకరణాలను పంపిణీ చేయడం జరుగుతోంది. బ్యాటరీ సహాయంతో నడిచే ఈ ట్రై మోటారు సైకిళ్లు నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానికులు అంటున్నారు.



దివ్యాంగునికి ట్రై మోటారు సైకిల్ అందజేస్తున్న వలంటీరు

రక్తదానం సామాజిక బాధ్యత

విజయనగరం ఫోర్ట్: రక్తదానం సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షు డు బి.పైడినాయుడు పిలుపునిచ్చారు. కలాం జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్క రూ రక్తదానానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శైలజ, గాంధీ బ్లడ్ డోన ర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి



విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: పొలాల్లో విత్తనాలు పొలాల్లో చల్లే ముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని ప్రకృతి వ్యవసాయం అధికారి గౌరీశ్వరరావు అన్నారు. మండలంలోని గుళ్లపాడు గ్రామంలో రైతులకు విత్తనశుద్ధిపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వల్ల పంటలకు చీడపీడలు ఆశించవన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని బాగా తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, రమణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

గోమాతకు పూజలు



పైడితల్లి ఆలయం వద్ద గోపూజ నిర్వహిస్తున్న హిందూ ధర్మ ప్రచార కమిటీ సభ్యులు

రాజాం: పట్టణంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయంలో ఆదివారం దసరా పూజలు ప్రారంభమయ్యాయి. హిందూ ధర్మ ప్రచారవేదికతో పాటు రాష్ట్ర దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ బీవీ మాధవరావు, ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, అర్చకుడు వేమకోటి సూర్యనారాయణశర్మ, కమిటీ సభ్యులు సలాది తులసీరావు, వెంపల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ముర్రాటలతో ఊరేగింపు



ముర్రాటలతో గాంధీనగర్ మహిళలు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి గాంధీనగర్‌లో మహిళలు ఆదివారం ముర్రాటలతో ఊరేగింపు నిర్వహించారు. దేవీ నవరాత్రులను పురస్కరించుకుని కాలనీలో దేవీ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. కాలనీలోని మహిళలంతా ముర్రాటలతో అమ్మవారికి మొక్కులు చెల్లించడంతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని బ్రహ్మకుమారీస్ యోగా జ్ఞానాశ్రమంలో ప్రపంచ ఆహార దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ బొబ్బిలి ఇన్‌చార్జ్ బి.కె.రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నం పరబ్రహ్మ స్వరూపమని, దానిని వృథా చేయకూడదని వక్తలు కోరారు. తాజాగా ఉన్న సాత్విక ఆహారం తీసుకోవాలన్నారు. తాజాగా ఉన్న ఆహారం వృథా చేయాల్సి వస్తే దానిని పేదలకు గానీ, యాచకులకు గానీ పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో హోమియో వైద్యుడు గెంబలి శ్రీనివాసరావు, పిరమిడ్ నిర్వాహకులు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో సత్తా చాటిన బాలికలు

శృంగవరపుకోట: స్థానిక మహంతి గ్లోబల్ స్కూల్‌కి చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఒలింపియాడ్‌లో సత్తా చాటారు. ఒలింపియాడ్ అకాడమీ రాష్ట్ర స్థాయిలో ఇటీవల నిర్వహించిన రామానుజన్ గణిత మహోత్సవం (ఆర్.ఎం.ఎం)లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.రేష్మ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం, 6వ తరగతి విద్యార్థిని పి.లాస్య తృతీయ స్థానం సాధించారు. గణితంలో ప్రతిభ చాటిన ఈ విద్యార్థినులను వారి తల్లుల సమక్షంలో ప్రిన్సిపాల్ శాంతిమహంతి ఆదివారం అభినందించారు.

నేడు తెర్లాంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం

తెర్లాం: స్థానిక పాతసినిమా హాల్ దగ్గర వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

17న బాడంగిలో..

బాడంగి: స్థానిక స్వామి కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ నేత బొమ్మినాయుని వెంకటనాయుడు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొనే ఈ సమావేశానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరుకావాలని ఆయన కోరారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

- ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఆదివారం రేగిడి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని చెప్పారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేస్తున్న పథకాలను వివరించడం చరిత్రలో ఇదే మొదటి సారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్‌మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

నేత్ర శస్త్రచికిత్సకు 110 మంది ఎంపిక

బాడంగి: స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. దత్తిరాజేరు మండలంలోని షికారుగంజికి చెందిన అమ్మ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు శిబిరానికి వచ్చిన రోగుల కంటిని పరీక్షించారు. మొత్తం 185 మంది కళ్లను తనిఖీ చేయగా, 110 మందికి నేత్ర శస్త్రచికిత్స అవసరమైనట్లు గుర్తించి, ఆపరేషన్ కోసం వారిని విశాఖపట్నానికి తరలించారు. కార్యక్రమంలో అమ్మసేవా ఫౌండేషన్ సభ్యులు సురేష్, సాయి, లక్ష్మణ్, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో-ఆర్డినేటర్ వెంకటరమణ పాల్గొన్నారు.



వృద్ధురాలి కళ్లను తనిఖీ చేస్తున్న ఆప్తాలమిస్ట్

కళింగకోమట్ల కార్పొరేషన్ సభ్యుల సమావేశం



కళింగ కార్పొరేషన్ చైర్మన్ సూరిబాబును సత్కరిస్తున్న సంఘ సభ్యులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని వాసవి కళింగ వైశ్య భవనంలో కళింగకోమట్ల కార్పొరేషన్ డైరెక్టర్లు, సంఘ సభ్యులతో సమావేశం ఆదివారం నిర్వహించారు. కళింగకోమట్లను ఓబీసీలో చేర్పించే విషయమై సభ్యులు తీర్మానం చేశారు. అలాగే పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబును సంఘ సభ్యులు బొబ్బిలి వీణ అందించి, సత్కరించారు. ఈ సందర్భంగా సూరిబాబు తన సొంత నిధులతో సమకూర్చిన రగ్గులను పేదలకు అందజేశారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

శృంగవరపుకోట: స్థానిక సర్వేపల్లి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల కరస్పాండెంట్ సన్యాసిరావు ఆదివారం తెలిపారు. ఇటీవల మండలంలోని వెంకటరమణపేట పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో బాలికలు, బాలుర విభాగాల్లో పాఠశాల విద్యార్థులు ఎం.హారిక, కె.పురందేశ్వరి, డి.రోహిత్‌సాయి, ఎం.మణీంద్ర ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హతసాధించారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు సురేష్, జయరాజ్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

రూ.39 లక్షలతో రోడ్డు పునరుద్ధరణ



కోమటిపల్లి-గర్భాం రోడ్డు నుంచి వింద్యావాసి గ్రామానికి వేసిన తారురోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని వింద్యావాసి గ్రామ తారురోడ్డును ఏఎంసీ నిధులు రూ.39 లక్షలతో ప్రభుత్వం పునరుద్ధరించింది. గతంలో ఈ రోడ్డు గోతులు తేలి అధ్వానంగా ఉండేది. ఈ రోడ్డుపై నుంచి రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు నానా అవస్థలు పడేవారు. గ్రామానికి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కోసం వచ్చిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు గ్రామస్తులు సమస్యను వివరించారు. తప్పక రోడ్డు పునరుద్ధరణ చేపడతామని అప్పట్లో ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. హామీ మేరకు రోడ్డు పనుల కోసం రూ.39 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో కొద్ది రోజుల క్రితమే కోమటిపల్లి-గర్భాం రోడ్డు నుంచి వింద్యావాసి గ్రామానికి రెండు కిలో మీటర్ల మేర బీటీరోడ్డు పునరుద్ధరణ పనులు ప్రారంభించి పూర్తి చేశామని ప్రాజెక్ట్ డీఈ అప్పలనాయుడు ఆదివారం తెలిపారు.